క్లుప్తంగా

వెంకటేశ్వర్లుకు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ పరామర్శ



నూజివీడు: గొల్లపల్లి మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్‌టీపీ వెంకటేశ్వర్లును మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం పరామర్శించారు. వెంకటేశ్వర్లు ఇటీవల గుండెకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ప్రతాప్ అప్పారావు పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో ఉన్న ఆయన ఇంటికి వెళ్లి వెంకటేశ్వర్లును పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రతాప్ వెంట కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ, నాయకులు పల్లే రవీంద్రరెడ్డి ఉన్నారు.

తిరువూరు ఎమ్మెల్యే తీరుపై మహిళల నిరసన



చిట్టేల(తిరువూరురూరల్): తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మహిళలతో అభ్యంతరకరంగా ప్రవర్తిస్తున్నారని మండలంలోని చిట్టేల గ్రామ మహిళలు ఆరోపించారు. సోమవారం గ్రామంలో మహిళలు రహదారిపై బైఠాయించి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉద్యోగినులకు, ప్రజాప్రతినిధులకు అభ్యంతరకరంగా ఫోన్లకు మెసేజ్‌లు పంపుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అసభ్యకర సందేశాలు పంపుతున్న ఎమ్మెల్యేపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తుమ్మలపల్లి విజయలక్ష్మి, బోయపాటి సునీత, లీలావతి, గీత, ఉష, కృష్ణవేణి, మంగతాయి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మానసిక వికాసం



ఇబ్రహీంపట్నం: క్రమశిక్షణ, నైతిక విలువలు కలిగిన విద్యతో విద్యార్థుల్లో మానసిక వికాసం విరాజిల్లుతుందని బిహార్‌కు చెందిన భక్తి చైతన్యానంద స్వామి అన్నారు. విజయవాడ రాత్ మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో వరద ముంపు బారిన పడిన విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో యోగా చేయడం ద్వారా పరిపూర్ణమైన మేధస్సు చేకూరుతుందన్నారు. యోగా, ప్రాణాయామంతో నిర్మలమైన తేజస్సు, ప్రశాంతమైన జీవనం అలవడుతాయన్నారు. 70 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సభ్యులు సదాశివ, విజయరాము, విజయవాడ, కొండపల్లి విస్తార్ ప్రముఖులు సంజన, కూనల యుగంధర్, బ్రిలియంట్స్ విద్యా సంస్థల అధినేత నడకుదిటి సీతారామయ్య పాల్గొన్నారు.

రూ.67 వేలు పలికిన గణపతి లడ్డూ



చంద్రగూడెం(మైలవరం): వినాయకుడు లడ్డూ రూ.67 వేలకు ఒక భక్తుడు వేలంలో దక్కించుకున్నాడు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన శీలం రవిబాబు వేలంలో సొంతం చేసుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ మేళ తాళాలు, కనక తప్పెట్లతో ఊరేగింపుగా రవిబాబును లడ్డూతో ఇంటికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీనారాయణస్వామి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



ఆగిరిపల్లి: బాలల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ప్రముఖ బాలల హక్కుల కార్యకర్త గోడే ప్రసాద్ అన్నారు. మండలంలోని తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ చిల్డ్రన్ హోంలోని బాలల హక్కుల పరిరక్షణ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలల అవసరాలకు చట్టబద్ధత లభించినప్పుడే అవి హక్కులు అవుతాయన్నారు. బాలల హక్కులను గౌరవించి వారిలో ఆత్మ విశ్వాసం పెంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మీ, సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మారగానే ప్రోటోకాల్ మరిస్తే ఎలా?

ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ



జి.కొండూరు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: ప్రభుత్వం మారగానే రెవెన్యూ అధికారులు ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించకపోవడం దారుణమని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక కమ్యూనిటీహాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలకు తనతో పాటు ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను పిలవకపోవడం రాజకీయ వివక్షేనని మండిపడ్డారు. అధికారులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలి తప్ప ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి తొత్తులులా పని చేయకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గత సమావేశంలో చేసిన తీర్మానాలపై సమీక్షించారు.

పనులకు ప్రతిపాదనలు సిద్ధం

పనుల పురోగతి, గ్రామాల్లో ఉన్న సమస్యలను అధికారులు, ప్రజా ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గడ్డమణుగు లోయలోని వలస కార్మికుల క్యాంపు వద్ద మినీ అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణానికి రూ.4 లక్షలు, చెర్వు మాధవరం గ్రామంలో శ్మశానం అభివృద్ధికి రూ.4 లక్షలు, కవులూరు గ్రామంలో డ్రింకింగ్ వాటర్ పైపులైన్ల పునరుద్ధరణ పనులకు రూ.4 లక్షలు, జి.కొండూరు హౌసింగ్ లే అవుట్‌లో రోడ్లకు మరమత్తులు, తూముల ఏర్పాటుకు రూ.5 లక్షలు, గంగినేని రైల్వే స్టేషన్ దగ్గర కాలనీకి డ్రెయిన్ల ఏర్పాటుకు రూ.2లక్షలు, ఇటీవల వచ్చిన వరదల కారణంగా మండల పరిషత్ కార్యాలయంలో ధ్వంసమైన కంప్యూటర్ల స్థానంలో కొత్త కంప్యూటర్ల కొనుగోలుకు రూ.2 లక్షలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.2 లక్షలు కేటాయిస్తూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనలను ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మతో పాటు సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనూరాధ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న విబేధాలు

జి.కొండూరు: వినాయకుడి ఊరేగింపు సాక్షిగా టీడీపీ నాయకులు చేసిన రచ్చ జి.కొండూరులో చర్చనీయాంశమైంది. హిజ్రాలతో డ్యాన్సులు, డీజేలలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు, తీన్మార్ స్టెప్పులు, కవ్వింపు చర్యలు ఆదివారం రాత్రి జి.కొండూరులో జరిగిన అలజడి గ్రామస్తులను తీవ్ర భయాందోళనకు గురి చేసింది. ఫలితంగా పోలీసులు నియంత్రించేందుకు చేసిన ప్రయత్నం రాజకీయ మలుపునకు కారణమైంది. హిజ్రాల డ్యాన్సులు, డీజేలను ఆపినందుకు టీడీపీ నాయకులు, యువకులు జైజై దేవినేని ఉమా, డౌన్ డౌన్ కేపీ అంటూ జి.కొండూరు గుడి సెంటర్‌లో చేసిన హంగామా రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది.

చేతులెత్తేసిన పోలీసులు..

జి.కొండూరులో టీడీపీలో వర్గ విబేధాలు తారాస్థాయికి చేరాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆధిపత్యం ప్రదర్శించేందుకు ఎవరికి వారు వారి స్థాయిలో నానా తంటాలు పడుతున్నారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులు, యువకులు జి.కొండూరు చెరువు కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. డీజేలలో పవన్ కల్యాణ్ గతంలో వైఎస్సార్ సీపీ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ప్లే చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దీనితో వివాదం ముదిరి గొడవకు దారితీసే అవకాశం ఉన్నందును నందిగామ ఏసీపీ రంగంలోకి దిగారు. సమీప పోలీసుస్టేషన్ల నుంచి సిబ్బందిని రప్పించి డీజేలను ఆపించి ఊరేగింపు జరుపుకోవాలని చెప్పారు. దీనితో రెచ్చిపోయిన టీడీపీ నాయకులు, యువకులు జి.కొండూరు గుడి సెంటర్‌లో అర్ధరాత్రి నిరసనకు దిగారు. డౌన్ డౌన్ వసంత, జైజై దేవినేని ఉమామహేశ్వరరావు అంటూ నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తుంది. టీడీపీ నాయకులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున చేరి డీజేకి అనుమతిస్తేనే నిరసన ఆపుతామని హెచ్చరించారు. ఈ క్రమంలో టీడీపీలో అక్కడే ఉన్న రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. గొడవ తీవ్రం కావడంతో పోలీసులు చేసేదిలేక డీజేకి అనుమతిచ్చారు. ఊరేగింపులో జరిగిన గందరగోళంలో ఐదుగురు వ్యక్తులు తనని చంపుతామని బెదిరిస్తూ తనపై దాడికి యత్నించారంటూ టీడీపీ నాయకుడు పజ్జూరు జగన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

నూజివీడు ఎంపీడీఓగా రాఘవేంద్రనాథ్



నూజివీడు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సి.రాఘవేంద్రనాథ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ విజయ్‌కుమార్ రిటైర్ కావడంతో ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ఎంపీడీఓగా పనిచేస్తున్న రాఘవేంద్రనాథ్‌ను నూజివీడు ఎంపీడీఓగా ప్రభుత్వం బదిలీ చేసింది. పంచాయతీ సెక్రటరీలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

అండర్-19కు ఎంపికైన ఎన్‌ఆర్ఐ కళాశాల విద్యార్థి

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో సెకండియర్ విద్యార్థి తాతా సాయి ప్రకాష్ ఏపీ అండర్ – 19 క్రికెట్‌కు ఎంపికయ్యాడని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గౌతు తెలిపారు. అక్టోబర్ 4న పంజాబ్ రాష్ట్రంలోని మొహాలీలో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థిని ఎన్ఆర్ఐ కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ నాగ భాస్కర్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రబాబు అభినందించారు.

మండలంలో వీఆర్వోల బదిలీ

నూజివీడు: నూజివీడు మండలంలోని వీఆర్వోలు పలువురు బదిలీ అయ్యారు. ముక్కొల్లుపాడు వీఆర్వో ఓ.అమర్‌చంద్ దిగవల్లికి, దిగవల్లి వీఆర్వో వజ్రాల జ్యోతి మొర్సపూడికి, తూర్పు దిగవల్లి వీఆర్వో ఎస్.సుబ్బారావు యనమదలకు, పాతరావిచర్ల వీఆర్వో షేక్ బాజీ తూర్పు దిగవల్లికి, కొత్త రావిచర్ల వీఆర్వో జీ రవికుమార్ బోర్వంచకు, పోలసానపల్లి వీఆర్వో ఎం.రంగారావు పట్టణంలోని 16వ సచివాలయానికి, 16వ సచివాలయం వీఆర్వో సయ్యద్ అన్సారీ పోలసానపల్లికి, బత్తుల వారిగూడెం వీఆర్వో రామనోళ్ల పద్మావతి ముక్కొల్లుపాడుకు, ఎంఎన్‌పాలెం వీఆర్వో బివీ నాగేంద్రరావు పోతురెడ్డిపల్లికి, పోతురెడ్డిపల్లి వీఆర్వో కే దుర్గామల్లేశ్వరి ఎంఎన్‌పాలెంకు, మీర్జాపురం వీఆర్వో కె.శ్రీనివాసరావు గొల్లపల్లి-1కు, వెంకటాయపాలెం వీఆర్వో జే చింతయ్య కొత్త రావిచర్లకు, బోర్వంచ వీఆర్వో వై వీరవెంకయ్య వెంకటాయపాలెనికి, గొల్లపల్లి-1 వీఆర్వో టీ శ్రీరాములు ముదినేపల్లి మండలానికి బదిలీ అయ్యారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి



నూజివీడులో అర్జీ పరిశీలిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(మీ కోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని ఆర్డీఓ వై.భవానీశంకరి ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేస్తామని, దీంతో అర్జీ పరిష్కారమైందా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ నుంచి సీఎం వరకు ఎప్పుడైనా చూడొచ్చన్నారు. మీ కోసంలో 8 అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్‌వై నూరాని, ఏడీఏ జీ విద్యాసాగర్, హెచ్ఓ ఆర్ హేమ తదితర అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

మైలవరం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లకు స్వచ్ఛభారత్ ప్రాముఖ్యతను వివరించి కార్యక్రమంలో పాల్గొనే విధంగా విద్యార్థులను ప్రోత్సహించారు. స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో అక్టోబర్ 2 వరకు స్వచ్ఛభారత్ కార్యక్రమాలను కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఫణికుమార్, యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ మేజర్ మన్నె స్వామి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బొర్రా వెంకటేశ్వరరావుకు నివాళి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న మాజీ ఎంపీ లగడపాటి తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బొర్రా వెంకటేశ్వరరావు సంస్మరణ సభ సోమవారం కొండపల్లిలో జరిగింది. వివిధ పార్టీలకు చెందిన నాయకులు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, కేంద్ర మాజీ సహాయ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్, సీనియర్ నాయకులు తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పీసీసీ ప్రధాన కార్యదర్శులు పరసా రాజీవ్‌రతన్, పోతురాజు ఏసుదాసు, నరహరిశెట్టి నరసింహారావు, మాజీ ఎంపీపీలు కోమటి జగన్ మోహన్‌రావు, తాడికొండ సత్యన్నారాయణ, కూటమి నాయకులు నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వారి కుమారులు డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్, బొర్రా క్రాంతిని ఓదార్చారు.

రేపటి నుంచి కార్మికుల బిక్షాటన



కొండపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉమామహేశ్వరరావు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో 183 మంది కార్మికులు వేతనాలు లేక పస్తులు ఉంటూ విధులు నిర్వహించే పరిస్థితి వచ్చిందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. వేతనాలు చెల్లించకుంటే అక్టోబర్ 2 నుంచి బిక్షాటన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని సోమవారం రాత్రి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. త్వరలో సమ్మెకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు జ్యోతిబస్, పట్టణ కార్యదర్శి ఎం.మహేష్, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత..

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. ఈ మేరకు గుంటూరులోని మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి హరినారాయణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. వేతనాలు సకాలంలో అందకపోవడంతో కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఆయనకు తెలియజేశారు. కార్మికుల వేతనాల సమస్య త్వరలో పరిష్కారానికి కృషి చేస్తామని హరినారాయణ్ హామీ ఇచ్చినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.

రామ్‌కో ఇండస్ట్రీస్ సేవలు అభినందనీయం



ఇబ్రహీంపట్నంలో కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత, రామ్‌కో యాజమాన్యం

ఇబ్రహీంపట్నం: వరద ముంపు బాధితులను ఆదుకోవడానికి రామ్‌కో ఇండస్ట్రీస్ సంస్థ యాజమాన్యం ముందుకురావడం అభినందనీయమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. వరద బాధితులకు రామ్‌కో ఇండస్ట్రీస్ సంస్థ 4వ సచివాలయం వద్ద నిత్యావసర సరుకుల పంపిణీలో సోమవారం ఎమ్మెల్యే వసంత హాజరై కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం శుభపరిణామమన్నారు. రామ్‌కో ఇండస్ట్రీస్ సంస్థ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.2 కోట్లు అందించడంతో పాటు బాధితులను కిట్లు అందజేస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు. రామ్‌కో మేనేజర్ పి.ఆనందరావు మాట్లాడుతూ.. రూ.9 లక్షలతో 700 మందికి కిట్లు అందజేశామన్నారు. హెచ్ఆర్ మేనేజర్ టీజీ రామ్మోహన్, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కేసుల నమోదు



చెక్కపల్లిలో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ మధుమోహన్

ముసునూరు: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలని, నకిలీలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్ దుకాణదారులను హెచ్చరించారు. సోమవారం ఆయన ఎరువుల నాణ్యత నియంత్రణలో భాగంగా నాణ్యతా పరీక్షల కోసం చెక్కపల్లిలోని గ్రోమోర్ ఎరువులు, విత్తన దుకాణంలో ఎరువుల నమూనాలను సేకరించారు. రైతులు ప్రతి కొనుగోలుకు సంబంధించిన బిల్లు తీసుకుని, పంట కాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా దాచి ఉంచాలని చెప్పారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, బిల్లు పుస్తకాలు, సెప్టెంబర్ స్టాకును పరిశీలించారు.

సమాజానికి దిక్సూచి ఉపాధ్యాయ వృత్తి



చనుబండలో హెచ్ఎం దంపతులను సన్మానిస్తున్న అధికారులు, నేతలు

చాట్రాయి: ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనది సమాజానికి దిక్సూచి లాంటిదని నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ అన్నారు. మండలంలోని చనుబండ హైస్కూల్‌లో ఎంఈఓ బ్రహ్మాచారి అధ్యక్షతన ఉద్యోగ విరమణ చేసిన హెచ్ఎం మోరంపూడి సత్యనారాయణ సన్మాన కార్యక్రమంలో సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు హెచ్ఎం దంపతులను సత్కరించారు. చాట్రాయిలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన మరో కార్యక్రమంలో ఉద్యోగ విరమణ చేసిన ఎంపీడీఓ దుర్గాప్రసాద్, ఈఓపీఆర్డీ మురళీకృష్ణ, మండలం నుంచి బదిలీ అయిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీ నారాయణ, మిషక్ ఆలీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఎంపీపీ లంకా నిర్మల, వైస్ ఎంపీపీలు సుబ్బారెడ్డి, జగన్మోహనరావు, సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

బొల్లిన మృతి పార్టీకి తీరని లోటు



గుడిపాడులో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్

ముసునూరు: గ్రామ పార్టీ కార్యదర్శి బొల్లిన నాగరాజు మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం రాత్రి అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందిన నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పార్టీ నేతలు పలువురితో కలిసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం సోమవారం ఉదయం మృతి చెందిన గ్రామ సర్పంచ్ బంధువు రాజబోయిన లక్ష్మి మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ రాజానాయన, సొసైటీ డైరెక్టర్ మందలపు రవిప్రసాద్, సర్పంచ్ శ్రీదేవి శ్రీనివాస్, మండల పార్టీ సభ్యుడు వేమూరి సురేష్, కొల్లి సాంబ, దుర్గాప్రసాద్, రాముడు, రాంబాబు, నాగేంద్ర, ధర్మరాజు, వలసపల్లి, గుళ్లపూడి నేతలు పాల్గొన్నారు.

3 నుంచి దసరా ఉత్సవాలు

నూజివీడు: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ కోట మహిషాసురమర్దని అమ్మవారి ఆలయంలో ఈ నెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ అలివేణి సోమవారం తెలిపారు. 3న శ్రీ బాలా త్రిపురసుందరీదేవి, 4న శ్రీ గాయత్రీదేవి, 5న శ్రీ అన్నపూర్ణదేవి, 6న శ్రీ లలితాత్రిపుర సుందరీదేవి, 7న శ్రీ మహాచండీదేవి, 8న శ్రీ మహాలక్ష్మీదేవి, 9న శ్రీ సరస్వతీదేవి, 10న శ్రీ దుర్గాదేవి, 11న శ్రీ మహిషాసురమర్దని దేవి, 12న శ్రీ రాజరాజేశ్వరిదేవి అలంకరణలో శ్రీ కోట మహిషాసురమర్ధని అమ్మవారు దర్శనమిస్తారన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

విస్సన్నపేట: స్థానిక ద్వారకానగర్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 3 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మూకుమ్మడిగా బుక్ కీపర్ల తొలగింపునకు యత్నం

తిరువూరు: వెలుగు గ్రామైక్య సంఘాల్లో పని చేసే బుక్ కీపర్లను తొలగించడానికి తిరువూరు మండలంలోని టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మండలంలో 37మంది బుక్ కీపర్లను మూకుమ్మడిగా తొలగించడానికి వెలుగు అధికారులు తెరచాటు ప్రయత్నాలు ప్రారంభించారు. గత నెల రోజులుగా గ్రామ స్థాయి నాయకులు బుక్ కీపర్ల మార్పునకు వెలుగు అధికారులపై ఒత్తిడి తెస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలు చేపట్టడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. గత మూడు రోజులుగా పలు వీఓలలో బుక్ కీపర్లను తొలగించాలని ఏకపక్షంగా తీర్మానాలు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావును వివరణ కోరగా, ఇంతవరకు బుక్ కీపర్లలో ఎవరినీ తొలగించలేదని, గ్రామైక్య సంఘాల తీర్మానం మేరకు మార్పుచేర్పులుంటాయని చెప్పారు.

పంట నమోదు వేగవంతం చేయాలి

తిరువూరు: ఖరీఫ్ పంటల వివరాలను వెంటనే ఈకేవైసీ చేయాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

3న చేపల చెరువులకు బహిరంగ వేలం

తిరువూరురూరల్: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని చెరువుల్లో చేపల పట్టివేతకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రవికాంత్ తెలిపారు. గుట్ట చెరువు, అంకమ్మ చెరువు, రావికుంట చెరువుల్లో చేపలను రెండేళ్ల కాలపరిమితికి అక్టోబరు 3వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో జరిగే వేలంలో ధరావత్తు చెల్లించి పాల్గొనాలన్నారు. పూర్తి వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అడ్వకేట్స్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులుగా రవీంద్ర, పవన్

ఇబ్రహీంపట్నం: ది బెజవాడ బార్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులుగా కొండపల్లికి చెందిన సీనియర్ న్యాయవాది పరగటి రవీంద్రబాబు, ఇబ్రహీంపట్నానికి చెందిన అడ్వకేట్ వల్లభనేని నాగ పవన్‌కుమార్‌లు ఎంపికయ్యారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొట్టా చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి అరిగల శివరామ్ ప్రసాద్ నియమించినట్లు సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1906లో ఆవిర్భవించిన బెజవాడ బార్ అసోసియేషన్ ప్రొటెక్షన్ కమిటీలో తమకు చోటు లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు వారు తెలిపారు. సభ్యులుగా అవకాశం కల్పించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ఎంపీడీఓ ఏంజిల్ విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ ఆరేపల్లి శిరీష తదితరులు

నూజివీడు: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేసినప్పుడు ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని, ఎంపీడీఓ వేమూరి ఏంజిల్ విజయ్‌కుమార్ కూడా ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించారని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. నూజివీడు ఎంపీడీఓ విజయకుమార్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ దంపతులను ఘనంగా సన్మానించారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.రామ్మోహన్‌రావు మట్లాడుతూ ఏ ఉద్యోగైనా తన ఉద్యోగ కాలంలో ప్రజల కోసమే పనిచేస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, ఈఓపీఆర్డీ టి.సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేపల్లి రాంబాబు, ఎంఈఓ-1, 2లు ఎం.సేవియా, ఎస్.జమలయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలపై ఎంపీపీ సమీక్ష

ఇబ్రహీంపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జోత్స్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. ఈసందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై ప్రజాప్రతినిధులు సమీక్ష జరిపారు. గ్రామాల్లో ఆయా శాఖల పురోభివృద్ధిపై అధికారులు నివేదిక చదివి వినిపించారు. ఇటీవల కాలంలో వచ్చిన వరద ప్రవాహంతో ప్రజలు నష్టపోవడంతో పాటు విద్యుత్ శాఖకు తీవ్రమైన నష్టం జరిగిందని పేర్కొన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు నష్టపోయినట్లు తెలిపారు. బదిలీపై వచ్చిన విద్యుత్ లైన్‌మెన్ కోటేశ్వరరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

నూజివీడు: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పరిపాలనపై దృష్టి సారించకుండా రాజకీయాలపై ఆసక్తి చూపుతోందని ధ్వజమెత్తారు. ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనర్ శివకుమార్, నాయకులు లాగు ఆకాష్, మల్లాది ఆకాష్, రాజ్యలక్ష్మి, లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.